నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

13 | హైదరాబాద్, ఆదివారం 4 ఫిబ్రవరి 2024 | YADADRI BHUVANAGIRI


## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు శుభాకాంక్షలు



మాజీ సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, రవీంద్రకుమార్

నకిరేకల్, ఫిబ్రవరి 3 : మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, నకిరేకల్, దేవరకొండ మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, రమావత్ రవీంద్రకుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల గజ్వేల్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు.



యాదగిరిగుట్ట ప్రధానాలయంలో స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

## శాస్త్రోక్తంగా యాదగిరీశుడి నిత్య తిరుకల్యాణోత్సవం

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 3 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా సాగింది. శనివారం ఉదయం స్వామివారికి సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు కల్యాణమూర్తులకు గజవాహన సేవలను నిర్వహించారు. అనంతరం వెలుపలి ప్రాకార మండపంలో తూర్పునకు అభిముఖంగా స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణోత్సవం జరిపారు. సుమారు గంటన్నరపాటు సాగిన వేడుకల్లో భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం కల్యాణంలో పాల్గొన్న భక్తులు స్వయంభూ నారసింహస్వామిని దర్శించుకున్నారు. స్వామివారి నిత్యోత్సవాలు తెల్లవారుజాము నుంచే మొదలయ్యాయి. ఉదయం సుప్రభాత సేవతో స్వయంభూ నారసింహస్వామిని మేల్కొలిపిన అర్చకులు తిరువారాధన నిర్వహించి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు తిరువీధి సేవోత్సవం, దర్బార్ సేవలో భక్తులు పాల్గొని తరించారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు నిరాటంకంగా సాగాయి. స్వామివారిని సుమారు 12 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 22,22,139 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

### కొండపైన భక్తుల వసతి గృహం : ప్రభుత్వ విప్ అయిలయ్య

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునే భక్తులు కొండపైనే నిద్రించే విధంగా వసతి గృహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తెలిపారు. శనివారం స్వామివారిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పురవీధులను కలియతిరిగారు. కొండపైన భక్తులకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనపై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. నమూనాలను, తాగునీటి సమస్య, భక్తులు సేద తీరాల్సిన స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అయిలయ్య మాట్లాడుతూ గతంలో మాదిరిగా కొండపైన భక్తులు సేదతీరేవిధంగా వసతి కల్పిస్తామన్నారు. క్యూ కాంప్లెక్స్‌లో ప్రత్యేకమైన గదిని వసతి గృహానికి కేటాయిస్తామని చెప్పారు. స్వామివారిని దర్శించుకునే భక్తులు కొండపైన కొబ్బరికాయ కొట్టేవిధంగా ప్రత్యేక స్థలం కేటాయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రామకృష్ణారావు, డీఈఓ దోర్బల భాస్కర్, వైటీడీఏ ఈఈ వెంకటేశ్వర్‌రెడ్డి, దేవస్థాన ఈఈ దయాకర్‌రెడ్డి, ఏఈఓలు గట్టు శ్రవణ్, గజవెల్లి రఘు, పర్యవేక్షకులు రాజన్‌బాబు పాల్గొన్నారు.

# అప్పగిస్తే అంతే సంగతులు

## కేంద్రం చేతికి కేఆర్ఎంబీ పోతే నీటి కష్టాలు

- శ్రీశైలం నుంచి నీటి రాక ప్రశ్నార్థకమే
- వట్టిపోనున్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు
- సాగర్ ఎడమకాల్వ, ఏఎంఆర్‌పీ ఆయకట్టుపై నీలినీడలు
- కరువు రోజుల్లో తాగునీటికి కటకటే
- విస్మయానికి గురిచేస్తున్న కాంగ్రెస్ సర్కార్ తీరు
- ఆయకట్టు రైతుల్లో మొదలైన ఆందోళన



నాగార్జునసాగర్ డ్యామ్ (ఫైల్)

నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి3 (నమస్తే తెలంగాణ) : కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ సర్కారు వ్యవహారశైలి ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతాంగాన్ని ఆందోళనకు గురిచేస్తున్నది. కృష్ణా నదిలో నీటి వాటాలు తేలకముందే శ్రీశైలంతోపాటు నాగార్జుసాగర్ ప్రాజెక్టులను కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ)కు అప్పగించేందుకు సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతున్నది. ఇదే నిజమైతే భవిష్యత్‌లో సాగర్ ఎడమ కాల్వతోపాటు ఏఎంఆర్‌పీ పరిధిలోని 14లక్షల ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారనున్నది. భారీ వరదలు వస్తే తప్ప శ్రీశైలం నుంచి సాగర్‌కు వరద నీరు రావడమే గగనం. ప్రస్తుతం ఉన్న నిబంధనలతో బోర్డు పరిధిలోకి ప్రాజెక్టులు వస్తే సాగర్‌కు రావాల్సిన నీరంతా రాయలసీమలోని పెన్నా బేసిన్‌కు ఏపీ సర్కార్ తరలించుకుపోవడం ఖాయమని నీటి పారుదల నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కేసీఆర్ సర్కార్ హయాంలో కృష్ణా నది ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకోవడంలో ఎక్కడా రాజీ పడలేదు. శ్రీశైలం నుంచి సాగర్‌కు వరద నీటిని తరలించడంలో, సాగర్ నుంచి సాగునీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవడంలోనూ పకడ్బందీగా వ్యవహరించారు. కృష్ణా జలాల వినియోగంలో ఏపీ సర్కార్ అభ్యంతరాలను సైతం తోసిపుచ్చి ముందుకు సాగారు. దాంతో 2014 నుంచి 2023 వరకు కృష్ణానదిలో ఏ మాత్రం వరద సాగినా ఆ నీటిని సాగర్ వరకు తీసుకురావడంలో కేసీఆర్ సర్కారు సక్సెస్ అయ్యింది. 2015 క్రాప్ హాలిడేను మినహాయిస్తే 2016, 2017, 2018 సంవత్సరాల్లో ఎగువ నుంచి సాగర్‌కు భారీ వరద లేకపోయినా శ్రీశైలం నుంచి నీటిని తరలించి ఆయకట్టులో రెండు పంటలకు విజయవంతంగా సాగునీటిని అందించింది. మిగతా సంవత్సరాల్లో భారీగా వరదలు రావడంతో ఇబ్బంది లేకుండా పోయింది. అయితే.. శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులపై రాష్ట్రానికి పెత్తనం ఉండడం వల్లే ఇది సాధ్యమైంది. అయితే ఈ ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించాలని ఏపీ ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నా కేసీఆర్ ప్రభుత్వం అభ్యంతరాలను వ్యక్తం చేసింది.

### అప్పగింతకు ఆటంకాలు ఇవే..

కృష్ణా ట్రిబ్యూనల్‌లో నీటి కేటాయింపుల విచారణ పూర్తయ్యేంత వరకు 50 ః 50 నిష్పత్తిలో నీటి కేటాయింపులు ఉండేలా చర్యలు చేపట్టాలి. అప్పగింతకు ముందే ఆపరేషనల్ ప్రొటోకాల్‌ను ఖరారు చేయాలని, నీటి వాటాలను తేల్చాలని కేసీఆర్ సర్కార్ డిమాండ్ చేసింది. సాగర్‌కు శ్రీశైలం నుంచి 264 టీఎంసీల నీటిని సరఫరా చేసేందుకే శ్రీశైలం ప్రాజెక్టును డిజైన్ చేశారు. ట్రిబ్యూనల్ అవార్డు ప్రకారం 830 అడుగులే కనిష్ట నీటి నిల్వ. శ్రీశైలం నుంచి 34 టీఎంసీల నీటిని మాత్రమే బయటి బేసిన్లకు ఏపీ మళ్లించేందుకు పరిమితం కావాలి. క్యారీ ఓవర్ స్టోరేజీ అవకాశం ఇవ్వాలని కూడా డిమాండ్ చేస్తూ వచ్చింది. అయితే.. వీటిపై బోర్డు స్పష్టత ఇవ్వకపోవడంతో కేసీఆర్ సర్కార్ అప్పగింతకు ఒప్పుకోలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్‌కు ఈ విషయంలో చిత్తశుద్ధి కొరవడింది. దాంతో గత నెల 17న జరిగిన బోర్డు సమావేశంలో రాష్ట్ర ప్రాజెక్టుల అప్పగింతకు రాష్ట్ర సర్కార్ ఒకే చెప్పిందంటూ మినిట్స్ బయటకు రావడంతో కలకలం రేపుతున్నది.

### కేసీఆర్ సర్కార్ చేసిందిదే..

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక డిమాండ్‌గా ఉంటూ వచ్చిన నీళ్ల అంశంపై సీఎం కేసీఆర్ నిబద్ధతకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిదర్శనం. గతంలో శ్రీశైలం డ్యామ్ నిండి క్రస్ట్‌గేట్లు ఎత్తితే తప్ప అప్పటివరకు సాగర్‌కు చుక్క నీరు విడుదల చేసేవారు కాదు. వాస్తవంగా శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద రాక ప్రారంభమైతే విద్యుత్ ఉత్పత్తి చేస్తూ ఆ నీటిని సాగర్‌కు విడుదల చేయవచ్చు. కానీ.. సమైక్య పాలకులు శ్రీశైలం నీటిని రాయలసీమకు తరలించడానికి వీలుగా ఆ పని చేసేవారు కాదు. దాంతో సాగర్ ఆయకట్టు రైతాంగం తీవ్రంగా నష్టపోయేది. దాంతో సరైన వర్షాలు లేని సమయంలో సాగర్ ఆయకట్టుకు నీటి విడుదల సమస్యాత్మకంగా మారేది. స్వరాష్ట్రంలో కేసీఆర్ తనదైన మార్క్‌ను చూపించారు. 2018 నుంచి కేసీఆర్ సర్కార్ కృష్ణా జలాలను సాగర్‌కు తరలించడంలో స్పష్టమైన వ్యూహంతో ముందుకు సాగింది. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద మొదలు కాగానే అక్కడ రాష్ట్ర ఆధీనంలో ఉండే ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రం ద్వారా కరెంటు ఉత్పత్తి చేస్తూ సుమారు 40వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తూ వచ్చింది. 2018లో దీనికి శ్రీకారం చుట్టి గతేడాది వరకు ఇదే విధానాన్ని అనుసరిస్తూ వచ్చారు. దీనిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేసినా సరే తెలంగాణ ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు. ఇరు రాష్ట్రాలకు ఉపయుక్తమైన సాగర్‌లో నీటిని నిల్వ చేయాలని భావించింది. తద్వారా ఆయకట్టు రైతాంగానికి లబ్ధి చేకూర్చాలన్న గట్టి పట్టుదలతో వ్యవహరిస్తూ వచ్చింది. 2020 వానకాలం సీజన్‌లో శ్రీశైలం నుంచి కరెంటు ఉత్పత్తి చేస్తూ సాగర్‌కు 25 రోజుల్లో 33 అడుగుల అదనపు నీటిమట్టంతో 70 టీఎంసీల నీటిని తరలించారు. దాంతో ఆయకట్టుకు సకాలంలో సాగునీటిని విడుదల చేయగలిగారు. 2021లో సైతం శ్రీశైలంలోకి వరద మొదలు కాగానే సాగర్‌కు నీటిని తరలించారు. తద్వారా సాగర్‌లో 10 అడుగుల మేర నీటిమట్టం పెరిగింది. 2022లోనూ ఇదేవిధంగా కేసీఆర్ సర్కార్ వ్యవహరించింది. ఆగస్టు 12న శ్రీశైలం ప్రాజెక్టుకు వరద మొదలు కాగా, 13 నుంచే పవర్ జనరేషన్‌తో సాగర్‌కు నీటిని తరలించారు. దీనివల్ల శ్రీశైలం గేట్లు ఎత్తే నాటికే సుమారు 22 అడుగుల నీటిని అదనంగా సాగర్‌కు తరలించారు. ఈ నీటితో ముందస్తు నీటి విడుదలకు ఆస్కారం ఏర్పడింది. కానీ.. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులను బోర్డుకు అప్పగిస్తే ఆ అవకాశం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండదు. దాంతో సమైక్య పాలన నాటి దుస్థితినే నాగార్జునసాగర్ ఎడమ కాల్వతోపాటు ఏఎంఆర్‌పీ ఆయకట్టుకు దాపురించనున్నది. దీనిపై రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ జంట నగరాలతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లా తాగునీటి అవసరాలకు కూడా గడ్డు కాలం దాపురించనుందనడంలో సందేహం లేదు.

# పెండింగ్ కేసులను పరిష్కరించాలి

- భువనగిరి కోర్టు భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి
- హైకోర్టు జడ్జి కె.శరత్



భువనగిరిలో కోర్టు నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న హైకోర్టు జడ్జి శరత్

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 3 : జిల్లాలో పెండింగ్ కేసులను పరిష్కరించాలని, భువనగిరి కోర్టు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని హైకోర్టు జడ్జి జస్టిస్ కె.శరత్ జిల్లా ఉన్నతాధికారులకు సూచించారు. భువనగిరి జిల్లా కోర్టులో న్యాయమూర్తులు, పోలీస్, రోడ్లు, భవనాల శాఖ అధికారులు, న్యాయవాదులతో శనివారం వేర్వురుగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కేసుల పరిష్కార తీరు, పరిపాలన అంశాలపై సమీక్షించి తగు సూచనలు చేశారు. క్రిమినల్ కేసుల్లో జాప్యం లేకుండా చూడాలని డీసీపీ రాజేశ్‌చంద్రను ఆదేశించారు. యాదగిరిగుట్టలో ఏర్పాటు చేయనున్న కోర్టుకు తాత్కాలిక భవనం, శాశ్వత నిర్మాణానికి 5 ఎకరాల స్థలం, జిల్లా కోర్టు నిర్మాణానికి చేపట్టనున్న చర్యలపై కలెక్టర్ హనుమంతు కె.జెండగే, అదనపు కలెక్టర్ ఎ.భాస్కర్‌రావు, ఆర్ అండ్ బీ ఈఈ శంకరయ్యతో సమీక్ష నిర్వహించారు. అనంతరం భువనగిరి పట్టణంలో నూతనంగా నిర్మించనున్న జిల్లా కోర్టు నిర్మాణ స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. కోర్టులో నిర్మాణాలు, సుందరీకరణ పనులు, ఇతర అంశాలపై చర్చించి భువనగిరి బార్ అసోసియేషన్ సభ్యులకు సూచనలు చేశారు. అనంతరం యాదాద్రి భువనగిరి జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం డైరీని ఆవిష్కరించారు. అంతకు ముందు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు ఆయనకు జ్ఞాపికను అందజేశారు. సమావేశాల్లో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.మారుతీదేవి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.దశరథరామయ్య, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత, రామన్నపేట, ఆలేరు, చౌటుప్పల్ జూనియర్ సివిల్ జడ్జిలు ఎ.ప్రదీప్, ఎ.చందన, ఎస్.సుమలత, టి.మహతి వైష్ణవి, భువనగిరి ఏసీపీ వెంకట్‌రెడ్డి, భువనగిరి ఆర్డీఓ అమరేందర్, భువనగిరి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నాగారం అంజయ్య, కార్యదర్శి సీహెచ్ రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

### స్వామివారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శరత్ దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ సంప్రదాయరీతిలో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ ఈఓ రామకృష్ణారావు స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం కొండ కింద తులసీ కాటేజీ వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్న కోర్టు భవనంతోపాటు గండి చెరువు పక్కనే 5 ఎకరాల్లో నిర్మించననున్న శాశ్వత కోర్టు భవన స్థలాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు

# 'పట్టభద్రులు' పాతిక వేలే..

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓట్లకు ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులివే

- గత ఎన్నికల్లో 35వేల ఓట్లు నమోదు
- ఎమ్మెల్సీ ఓటు నమోదుపై గ్రాడ్యుయేట్ల నో ఇంట్రెస్ట్
- నమోదుకు మిగిలింది ఇంక మూడ్రోజులే..



యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుకు గ్రాడ్యుయేట్లు ఆసక్తి చూపించడంలేదు. ఓటు నమోదు దరఖాస్తుకు గడువు సమీపిస్తున్నా పెద్దగా పట్టించుకోవడంలేదు. ఓటు నమోదుకు ఆశించిన స్థాయిలో స్పందన రావడంలేదు. గత ఎన్నికలతో పోలిస్తే ఈ సారి చాలా తక్కువగా దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుకు మరో రెండు రోజులు మాత్రమే సమయం ఉండటంతో అర్హులందరూ నమోదు చేసుకోవాలని జిల్లా అధికారులు కోరుతున్నారు.

వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి జనగాం ఎమ్మెల్యేగా విజయం సాధించారు. దాంతో ఆయన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో గ్రాడ్యుయేట్లు మళ్లీ ఓటు నమోదు చేసుకునేందుకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. 2023 నవంబర్ ఒకటి నాటికి డిగ్రీ పూర్తయి మూడేండ్లు నిండిన వారందరూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెల 6వ తేదీ వరకు ఓటరు నమోదుకు అవకాశం ఉన్నది. అంటే ఇంకా మూడు రోజుల సమయం మాత్రమే ఉన్నది. ఈ నెల 21న ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేస్తారు. ఈ జాబితాపై 24 నుంచి మార్చి వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఈ నెల 24నుంచి 14వరకు మరోసారి ఓటరుగా నమోదు చేసుకోవడానికి అవకాశం ఉంటుందని అధికారులు చెప్పారు. కాగా ఏప్రిల్ 4న తుది జాబితాను విడుదల చేస్తారు.

### ఓటరు నమోదుకు నో ఇంట్రెస్ట్..

జిల్లాలో ఓటరు నమోదుకు గ్రాడ్యుయేట్లు పెద్దగా ఆసక్తి చూపించడంలేదు. గత ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో జిల్లాలో 35వేల మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఈ సారి ఇప్పటి వరకు 25వేల మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. అంటే ఇంకా 10వేల మంది దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అయితే ఈ సారి నమోదు కోసం ఓటరు ఎపిక్ కార్డు తప్పకుండా జత చేయాలనే నిబంధన వచ్చింది. ఈ నేపథ్యంలో కొందరు ఎపిక్ కార్డు ఉన్న చోట దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తున్నది.

### అందరూ నమోదు చేసుకోవాల్సిందే..

సాధారణంగా ఓటరు నమోదుకు నోటిఫికేషన్ జారీ చేస్తే.. కొత్తవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలనే ఆలోచనలో అంతా ఉంటారు. కానీ.. పట్టభద్రుల ఓటరు మాత్రం కొత్తవారు, పాతవారు అందరూ మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అర్హులైన గ్రాడ్యుయేట్లు వారు నివసించే పరిధిలో ఉండే తాసీల్దార్ లేదా ఆర్డీఓ కార్యాలయాల్లో నేరుగా ఫారం 18 ద్వారా అప్లికేషన్లు అందజేయాలి. ఆన్‌లైన్‌లో https://ceotserms2.telangana.gov.in/MLC/Form18.aspx అనే లింక్ ద్వారా కూడా దరఖాస్తులు చేయవచ్చు. ఇందుకు డిగ్రీ మెమో లేదా ప్రొవిజనల్ సర్టిఫికెట్, ఓటరు ఐడీ కార్డు, ఆధార్ కార్డు జత చేయాలి.

### అందరూ నమోదు చేసుకోవాలి



పట్టభద్రుల ఓటు నమోదు డ్రైవ్ నడుస్తున్నది. దీనిపై జిల్లాలో విస్తృతంగా అవగాహన కల్పించాం. వివిధ రూపాల్లో ప్రచారం చేశాం. ఈ నెల 6వ తేదీ వరకు మాత్రమే దరఖాస్తుకు సమయం ఉన్నది. అర్హులైన పట్టభద్రులు అందరూ ఓటు నమోదు చేసుకోవాలి. దగ్గరలోని తాసీల్దార్ కార్యాలయం లేదా ఆన్‌లైన్‌లో ఫారం 18 ద్వారా నమోదు చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని పట్టభద్రులు సద్వినియోగం చేసుకోవాలి.

– హన్మంతు కె.జెండగే, జిల్లా కలెక్టర్

# తగ్గిన సాగు

## గత యాసంగి కంటే 40వేల ఎకరాలు తక్కువ



- జిల్లాలో ఈ సారి 2.71లక్షల ఎకరాల్లోనే పంటలు
- కిందటిసారి 3.10లక్షల ఎకరాల్లో సాగు
- వర్షాభావ పరిస్థితులే కారణం
- తగ్గిన వర్షపాతం, అడుగంటుతున్న భూగర్భ జలాలు

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో సాగు విస్తీర్ణం తగ్గింది. గతేడాది యాసంగి సీజన్ కంటే ఈ సారి సుమారు 40వేల ఎకరాల్లో తక్కువ సాగైంది. పోయినసారి జిల్లా వ్యాప్తంగా 3.10లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా.. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 2.71లక్షల ఎకరాల్లోనే పంటలు సాగు చేశారు. వర్షాభావ పరిస్థితులతోనే పంటల సాగు తగ్గినట్లు అధికారులు భావిస్తున్నారు. వర్షాలు సరిగా కురువకపోవడం, లోటు వర్షపాతం నమోదు కావడం, భూగర్భ జలాలు పడిపోవడంతో రైతులు సాగుకు వెనుకడుగు వేశారు.

యాసంగిలో పంటల సాగుకు వ్యవసాయ శాఖ ప్రణాళిక రూపొందించింది. జిల్లాలో ఈ సారి 2,61,105 ఎకరాల్లో పంటల సాగుకు అంచనా వేసింది. జిల్లా వ్యాప్తంగా నెల రోజులుగా వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రైతులు సాగు పనుల్లో బిజీ అయ్యారు. ప్రస్తుతం యాసంగి వరి నాట్లు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు 2.71లక్షల ఎకరాల్లోనే పంటలు సాగు చేయగా, ఇందులో 2.70 లక్షల ఎకరాల్లో వరి పంట వేశారు. వలిగొండ మండలంలో 38,169ఎకరాలు, రామన్నపేటలో 27,632, భూదాన్ పోచంపల్లిలో 26,525, భువనగిరి మండలంలో 21,001 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. జిల్లాలో రైతులు ఎక్కువగా వరి పంటపైనే ఆసక్తి చూపించారు. ఇతర పంటలపై దృష్టి పెట్టడంలేదు. 406 ఎకరాల్లో మాత్రమే కూరగాయలు, 238 ఎకరాల్లో జొన్నలు సాగు చేశారు.

### 40వేల ఎకరాల్లో తగ్గిన సాగు..

జిల్లాలో ఆరు లక్షల ఎకరాలకు పైగా భూమి సాగుకు అనుకూలంగా ఉన్నది. గడిచిన ఐదేండ్లు వానలు సకాలంలో పడటంతోపాటు కాళేశ్వరం జలాలు రావడంతో భూగర్భ నీటి మట్టం పెరిగింది. దాంతో 4.50లక్షల ఎకరాల్లో తోటలు సహా వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఎక్కువ మంది రైతులు వరి సాగు వైపు ఆసక్తి చూపించారు. గత యాసంగి సీజన్‌లో 3.10లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా.. ఈ సారి సుమారు 40వేల ఎకరాల్లో తగ్గినట్లు లెక్కలు చెబుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం పడిపోయిన మొదటి సీజన్‌లోనే వివిధ రకాల ఇబ్బందులు తలెత్తి సాగు తగ్గుముఖం పట్టడం గమనార్హం.

### తగ్గిన వర్షపాతం.. అడుగంటిన జలాలు

ఈ సారి పంటల సాగు తగ్గడానికి వ్యవసాయ శాఖ అధికారులు పలు కారణాలను విశ్లేషిస్తున్నారు. నీటి కొరత ఉండటం, వర్షాలు సరిగా కురువకపోవడం కారణంగా భావిస్తున్నారు. జిల్లాలో రెండు శాతం లోటు వర్షపాతం నమోదైంది.

ఫలితంగా జిల్లాలో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. భూగర్భ జలాల శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలో డిసెంబర్‌లో సగటున 6.04మీటర్ల లోతున భూగర్భ జలాలు ఉన్నాయి. 2022 డిసెంబర్‌తో పోలిస్తే 2023 డిసెంబర్‌లో భూగర్భ జలాలు 2.08మీటర్ల మేర ఇంకిపోయాయి. అదేవిధంగా బీఆర్ఎస్ పాలనలో రైతులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తలేదు. 24గంటల నాణ్యమైన ఉచిత కరెంట్, సరిపడా విత్తనాలు, ఎరువులు, రసాయనాలు అందుబాటులో ఉండేవి. దీంతో రైతులు పెద్ద ఎత్తున సాగు చేసేందుకు ముందుకు వచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితులు కనిపించడంలేదు.